"అదేమిటి సార్ అలా అంటారు. మా ఆఫీసరుగారు నన్ను నేరుగా పాఠశాలకు వెళ్ళమన్నారు. విద్యాకమిటీ సభ్యుల, సర్పంచ్, మండలాధ్యక్షులు తదితర పేర్లతో బాటు యం.పి.టి.సి, జడ్.పి.టి.సి. సభ్యుల పేర్లు కూడా చార్టులలో రాసి వేలాడదీసి వుంచుతారన్నారు. పైగా హెడ్మాస్టరును కలిస్తే కావలసిన ఆ వ్యక్తిని పిలిపిస్తాడని కూడా చెప్పారు"

"అలాగే ప్రయత్నిద్దాం! ఒరే చెంచురాజా! నువ్వు పెద్దరెడ్డిగారింటికెళ్ళి ఈ కాగితం చూపి విషయం కనుక్కురా" అని పంపాడు. వాడు తిరిగొచ్చాక కావలసిన సమాచారమిచ్చి ఆయన్ని సాగనంపి తిరిగి పాఠం మొదలు పెట్టారు.

"బాబూ సాయి! ఈ పట్టికలో 3 వుంచి తక్కిన గుణిజాలన్నింటినీ కొట్టివేయి"

"ఓ అయ్యోరా!" బడి ఎదురుగా వున్న మార్కండేయులుదా పిలుపు.

"ఏం మార్కండేయులుగారు ఏం కావాలి"

"మీ బడి పిలకాయలు మా ఇళ్ళలో దూరి పూల మొక్కలు తుంచేస్తున్నారు. వీళ్ళకి మరీ భయం లేకుండాపోతున్నది. మీరు మరీ నెత్తికెక్కించుకుంటున్నారు. పిల్లల్ని కొట్టకపోతే సదువుసాములెలా వస్తాయి చెప్పండి"

"మార్కండేయులుగారూ మా పిల్లలు ఇక మీ ఇళ్ళ ఛాయలకు రారు. నేను జాగ్రత్త తీసుకుంటాను సరేనా" అని సమాధానపరిచారు.

"పెద్దోళ్ళు నేనిట్టా అడిగానని ఏమీ అనుకోమాకండి వస్తా"

అతనలా వెళ్ళాక "అబ్బాయ్ చెంచురాజా ఈ పట్టికలో 5 వుంచి మిగిలిన 5 గుణిజాలన్నింటిని కొట్టివేయ్"

"ఎవర్రా బయటికెళ్ళింది. ఒరే వినోద్ కుమార్ ఇట్రారా వేలెడంత లేవు. నన్నే ఏమార్చి కళ్ళుగప్పి బయటకెళతావా. ఇంకెప్పుడైనా ఇలా చేస్తావా" అంటూ వీపు మీద ఒకటిచ్చాడు. వాడు ఏడుస్తూ బయటకు పరుగుతీశాడు. పెంకి వెధవ మళ్ళీ వస్తాడులెమ్మని రంగనాథం పాఠంలో మునిగిపోయాడు.

"అయ్యోరెక్కడరా! ఎట్టపోయినాడు" అది వినోద్‌కు మార్ తల్లి సులోచనమ్మ గొంతు.

"ఏమైంది సులోచనమ్మా" అడిగారు రంగనాథం.

"ఆ! ఏమైందా..ఇట్టాగేనా పిల్లల్ని కొట్టేది. నిన్ను చదువు చెప్పమన్నారా చావగొట్టమన్నారా! నీకు పిల్లా పాప లేరా?"

విచిత్రమైన పులుసు విస్తరాకును మింగినట్లు రోజుకో వింత ప్రోగ్రాం వచ్చి చదువులు కుంటుబడి ప్రమాణాలు దిగజారిపోతున్నాయి. అటు ఊళ్ళో ప్రజలు చిన్న చిన్న విషయాలకు సైతం సర్దుబాటు వీడి సమస్యలు కల్పిస్తున్నారు.

ఈ స్థితిలో బోధన పరమావధిగా భావించే రంగనాథం లాంటి అనేకానేకులు కలుషితమైన విద్యావ్యవస్థతో రాజీ పడలేక, ఇటు విద్యార్థులకు పూర్తి న్యాయం చేయలేక, ఎదిరించే తెగింపు లేక మానసిక క్షోభతో సతమతమౌతున్నారు.

-చిరమన వెంకట రమణయ్య
(గూడూరు)

తనదాకా వస్తే...

బాల్కనీలో కూర్చుని న్యూస్ పేపర్ చదువుకుంటున్నాడు రామారావు. అతని భార్య విజయ ఇల్లంతా ఊడ్చి చెత్తని ప్లాస్టిక్ బుట్టలో వేసింది. బాల్కనీ దగ్గరకు వచ్చి, మేడమీద నుంచి ఆ బుట్టను క్రిందికి వంచేసింది.

గాలికి కొన్ని కాగితాలు తిరిగి బాల్కనీలోకే వచ్చేసాయి. మిగిలిన చెత్త, తరిగిన కూర ముక్కలు, దుమ్ము రోడ్డు మీద పడింది.

"కొంచెం కిందికి వెళ్ళి చెత్తకుండీలో వేస్తే బాగుంటుందిగా!" అన్నాడు రామారావు.

"మళ్ళీ అదో పని కూడానా! రోడ్డు మీదికి విసిరేస్తే పోయేదానికి. అయినా మెట్లు దిగి క్రిందికి ఎవరు పోతారు?" అంది విజయ.

"ఎవరి నెత్తినైనా పడితేనే!"

"ఎందుకు పడుతుంది? ఏం పడదు. కింద నడిచే వాళ్ళు జాగ్రత్తగా నడవాలి. అయినా అందరూ చేసే పనేగా ఇది!" అంటూ లోపలికి వెళ్ళింది ఆమె.

ఇంక ఆమెతో మాట్లాడి లాభం లేదనుకుని ఊర్కుండిపోయాడు రామారావు. నాలుగు రోజులు గడిచాయి.

ఆరోజు ఉదయం ఆరున్నర కావస్తోంది.

ఇల్లంతా దేనికోసమో వెతుకుతోంది విజయ.

రామారావు లేచి ముఖం కడుక్కోబోతూ "ఏమిటి వెతుకుతున్నావు?" అని అడిగాడు.

"చంటాడి వెండి ఉగ్గుగిన్నె కనిపించడం లేదండీ. పొద్దున్నే ఉగ్గు కూడా పెట్టాను" అంది విజయ ఆందోళనగా.

"అమ్మా..ప్రొద్దున్న తమ్ముడు దానిని పట్టుకుని పాకుతూ సావిట్లో తిరుగుతుంటే చూశాను. ఒకవేళ నువ్వు చీకట్లో దానిని కూడా ఊడ్చి అవతల పారేశావేమో!" అంది కూతురు లలిత.

"అవునేవ్...అంతే చేసి వుంటాను. ఇందాక ఊడుస్తుంటే ఏదో ఘల్లుమంది కూడాను. ఏ ఇనుముక్కో అనుకున్నాను. నేను క్రిందికిపోయి వెతుక్కుని వస్తాను కానీ నువ్వు కొంచెం వంటిల్లు శుభ్రం చేయి" అంటూ క్రిందికి పరుగుతీసింది విజయ.



లలిత వంటింట్లోకి వెళ్ళింది.

క్రిందటి రోజు సాయంత్రం తరిగిన కూర పెచ్చులూ, మిగిలిపోయిన కాఫీ డికాక్షన్ అన్నీ గిన్నెలోకి ఎత్తి బాల్కనీ లోంచి వీధిలోకి విసిరేసి తిరిగి వచ్చింది. మరో నిముషంలో విజయ వగరుస్తూ పైకి పరుగెత్తుకు వచ్చింది.

ఒళ్ళంతా కాఫీ డికాషన్ మరకలు, నెత్తిమీద కూరచెక్కలతో "ఏమిటే..నువ్వు చేసిన పని?" అంటూ అరిచింది.

"క్రింద చూడకుండా విసిరానమ్మా..నీమీద పడినట్లుంది!" అంది లలిత భయంగా.

అప్పుడే బాత్‌రూంలోంచి వస్తున్న రామారావుకి ఆ దృశ్యం చూసేసరికి నవ్వు ఆగలేదు.

"అందుకే వీధిలోకి చెత్త విసరకూడదంటాను. ఇది నీకయింది కాబట్టి సరిపోయింది. ఇదే ఇంకెవరిమీద అయినా పడివుంటే పెద్ద గొడవై పోయి వుండేది" అన్నాడు.

విజయ ఏమీ మాట్లాడలేక బాత్‌రూం వైపు వెళ్ళిపోయింది.

"అమ్మా...ఉగ్గుగిన్నె వంటింటి మోరీలో దొరికింది" అంది లలిత.

"సరేలే..బట్టలు తీసుకురా!" అని బాత్‌రూంలోంచి అరిచింది విజయ.

-కొచ్చెర్ల రమేష్ బాబు
(విజయవాడ)